క్లుప్తంగా

విష సర్పాలతో బెంబేలు



తిరువూరు: తిరువూరు పట్టణంలో విష సర్పాలు యథేచ్ఛగా సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. గత రెండు నెలల్లో పట్టణంలోని అశోక్‌నగర్, శాంతినగర్, రాజుపేట ప్రాంతాల్లో 20కి పైగా తాచుపాములు, జెర్రిగొడ్లను స్నేక్ రెస్క్యూ టీమ్ సభ్యులు పట్టుకుని సమీపంలోని ఖమ్మం జిల్లా అడవుల్లో వదిలారు. పడక గదులు, వంట గదుల్లోకి సైతం పాములు ప్రవేశిస్తుండటంతో మహిళలు, చిన్న పిల్లలు ఆందోళనకు గురవుతున్నారు.

ఎస్సీ కుల జాబితాల ప్రదర్శన

మైలవరం: మైలవరంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఎస్సీ కుల జాబితా నోటీసు బోర్డులో ఏర్పాటు చేశామని మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి. శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరికైనా సందేహాలు ఉంటే గ్రామ సచివాలయాల్లో అబ్జెక్షన్ నమోదు చేసుకోవచ్చన్నారు.

47 మందికి నేత్ర వైద్య పరీక్షలు



చాట్రాయి: శ్రీ సత్యసాయి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో పోలవరంలో నూజివీడు గిఫర్డ్ మెమోరియల్ కంటి ఆస్పత్రి సహకారంతో ఉచిత నేత్ర వైద్యశిబిరం గురువారం నిర్వహించారు. 47 మందికి వైద్య పరీక్షలు చేయగా 23 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశామని కంటి వైద్యులు దత్తు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చెలికాని బాబ్జీ, ట్రస్టు అధ్యక్షుడు జె.రంగారెడ్డి, కార్యదర్శి రామశేషు, కోశాధికారి మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

నెమలిలో ఏకాదశి పూజలు

నెమలి(గంపలగూడెం): నెమలి వేణుగోపాల స్వామి దేవస్థానంలో మార్గశిర ఏకాదశి సందర్భంగా గంపలగూడెం వికాస తరంగిణి ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు జరిగాయి. భగవద్గీత పారాయణం, శరణాగతి గద్యం, శ్రీరంగ గద్యం, వైకుంఠ గద్యం, విష్ణు సహస్ర నామ పారాయణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. వికాస తరంగిణి ప్రతినిధులు సముద్రాల జ్యోతి, సుధారాణి పాల్గొన్నారు.

రీ సర్వేపై అవగాహనా ర్యాలీ

మైలవరం: ర్యాలీ రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో రీ సర్వేపై అవగాహనా ర్యాలీ రెడ్డిగూడెం మండలం ముచ్చనపల్లి, శ్రీరామపురం గ్రామాలలో గురువారం నిర్వహించారు. రైతులు తమ వ్యవసాయ భూములను రీ సర్వే చేయించుకోవాలని తహసీల్దార్ జె. సుశీలాదేవి సూచించారు. గతంలో ఏమైనా తప్పులు ఉంటే సరిచేయించుకోవాలని చెప్పారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గంధం పుల్లయ్య, సర్వేయర్లు శివశంకర్, మురళి, గ్రామ సర్వేయర్లు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు దారుణం



నూజివీడు: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో అనుచితంగా మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎన్ఆర్ హనుమాన్ డిమాండ్ చేశారు. మైలవరం రోడ్డులోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో గురువారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీడిత ప్రజల కోసం రాజ్యాంగంలో అనేక హక్కులు, అవకాశాలు కల్పించారని వివరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి. రాజు, నాయకులు నండూరి పద్మాంజలి, శోభనాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి బెడ్‌షీట్ల వితరణ

విస్సన్నపేట: సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో విస్సన్నపేట ప్రభుత్వాస్పత్రికి గురువారం బెడ్ షీట్లు అందజేశారు. సత్య సాయిబాబా జన్మదినోత్సవం సందర్భంగా రోగుల పడకలకు అవసరమైన బెడ్‌షీట్లను అందజేసినట్లు సత్యసాయి సేవా సమితి కన్వీనర్ జగ్గవరపు రంగారెడ్డి తెలిపారు. సేవా సమితి సభ్యులు, ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొండపల్లి: స్వయం ఉపాధి శిక్షణకు ఈనెల 27 నుంచి కొండపల్లి పురపాలక సంఘ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తామని మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2047 విజన్ యాక్షన్ ప్లాన్ మేరకు మెప్మా ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరికి జీవనోపాధి కల్పించాల్సి ఉందన్నారు. బార్బర్, బ్యూటీషియన్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, ప్లంబర్, టీవీ మెకానిక్ శిక్షణకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. వివరాలకు 79016 10197, 79016 10174 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఇదేం బాదుడు బాబూ

అధికారంలోకి వస్తే కరెంటు బిల్లులు రూపాయి కూడా పెంచమని, అవసరమైతే తగ్గిస్తామని చంద్రబాబు ప్రజలకు హామీ ఇచ్చారు. తీరా అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే రూ.15,485 కోట్ల భారాన్ని మోపి ప్రజల నెత్తిన కుచ్చు టోపీ పెట్టారు. ప్రభుత్వం విద్యుత్ చార్జీలను భారీగా పెంచి ప్రజల నెత్తిన భారం మోపి వారి నడ్డి విరుస్తోంది. చలికాలంలో కరెంటు బిల్లులు తక్కువ రావాల్సి ఉండగా భారీగానే వస్తుండటం చూసి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరి బిల్లులను పరిశీలిస్తే అసలు కంటే అదనపు బాదుడే ఎక్కువగా ఉంటోంది. దీంతో ఇదెక్కడి బాదుడంటూ ప్రజలు ప్రభుత్వ తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

- ప్రజలపై కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల భారం
- అసలు కంటే అదనపు బాదుడే ఎక్కువ
- ఆందోళన చెందుతున్న ప్రజలు



నూజివీడు నియోజకవర్గంలోని విద్యుత్ కనెక్షన్ల వివరాలు

మండలం	గృహ సర్వీసులు	వ్యాపార సర్వీసులు	మొత్తం
నూజివీడు టౌన్	18,539	3,395	21,934
నూజివీడు రూరల్	20,376	1,636	22,012
ముసునూరు	15,691	1,340	17,031
ఆగిరిపల్లి	18,286	1,999	20,285
చాట్రాయి	13,841	1,199	15,040
మొత్తం	86,733	9,569	96,302

నూజివీడు: నియోజకవర్గంలో మొత్తం 86,733 గృహ సర్వీసులు, 9569 వ్యాపార సర్వీసులు ఉన్నాయి. యూనిట్ ధరలను పెంచకుండా ప్రభుత్వం తెలివిగా ఎఫ్‌పీపీసీఏ చార్జీలంటూ భారీగా విధిస్తూ ప్రజల జేబులకు చిల్లు పెండుతోంది. డిసెంబర్‌లో ఇచ్చిన బిల్లుల్లో ఏప్రిల్ 2022 సంవత్సరానికి సంబంధించిన ఎఫ్‌పీపీసీఏ చార్జీలను విధించారు. ఇది దాదాపు యూనిట్‌కు రూ.1.20 పైసల వరకు పడుతోంది. దీంతో వినియోగదారులు వాడిన యూనిట్లకు వచ్చే బిల్లు కంటే ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన అదనపు బాదుడే ఎక్కువగా ఉంటోంది. నియోజకవర్గ వినియోగదారులపై నెలకు సుమారు రూ. 80 లక్షల నుంచి రూ. కోటి రూపాయల వరకు అదనపు భారం పడనుంది. పట్టణంలోని ధంధం గార్డెన్‌కు చెందిన ఒక వ్యక్తికి వాడిన విద్యుత్‌కు చార్జీ రూ.430 కాగా, దీనికి అదనంగా రూ.340 విధించడంతో రూ.770 బిల్లు వచ్చింది. ఇందులో టీడీపీ ప్రభుత్వం వచ్చాక నవంబర్ నుంచి విధిస్తున్న ఎఫ్‌పీపీసీఏ చార్జీనే రూ.143 ఉంది. దీనికి తోడు ట్రూ అప్ చార్జీలు, కస్టమర్ చార్జీలు, ఇంధన సర్దుబాటు చార్జీలు, ఫిక్స్‌డ్ చార్జీలు అన్నీ కలిపితే బిల్లులు తడిసి మోపెడవుతున్నాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజలపై ప్రేమ ఉన్నట్లుగా కల్లబొల్లి మాటలు చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని ఎందుకు విస్మరించారని పలువురు ప్రశ్నిస్తున్నారు. చలికాలం కావడంతో తక్కువ విద్యుత్ వాడినా బిల్లు ఎక్కువగా వచ్చిందని పలువురు వాపోతున్నారు. ఇంత దారుణంగా భారం మోపితే ఎలాగని పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఎండాకాలం మాదిరి వచ్చింది



చలి కాలమైనా బిల్లు మాత్రం ఎండాకాలం మాదిరి వచ్చింది. వేసవిలో ఏసీ వేయడంతో పాటు ఫ్యాన్లు కూడా తిరుగుతాయి. చలికాలంలో ఏసీ వేయడం పూర్తిగా ఆపేసినా అంతే బిల్లు రావడమేమిటో అర్థం కావడం లేదు. ఫ్యాన్లు కూడా సరిగా వేయడం లేదు. అయినా బిల్లు మాత్రం తగ్గలేదు.

– బేరారామ్, నూజివీడు

అదనపు బాదుడు తగదు



వాడిన కరెంటుకు వేస్తున్న చార్జీల కంటే అదనంగా వేసే చార్జీలు అధికంగా ఉన్నాయి. బిల్లు కంటే ఎక్కువగా వస్తున్నాయి. నేను వాడిన యూనిట్లకు రూ.1,104 రాగా దీనికి అదనంగా రూ.500 ఇతర చార్జీలు వేశారు. ఇంత దారుణంగా చార్జీలు విధిస్తే డబ్బులు ఎక్కడి నుంచి తీసుకురావాలో తెలియడం లేదు.

– ఎం.అంకిరెడ్డి, నూజివీడు

ఘనంగా బాక్సింగ్ డే



ముసునూరు: ప్రపంచ బాక్సింగ్ డే వేడుకలను ముసునూరు ఆర్‌సీఎం చర్చి వద్ద గురువారం ఘనంగా నిర్వహించారు. ముసునూరు ఆర్‌సీఎం విచారణ కర్త రెవరెండ్ ఫాదర్ జోసఫ్ తంబి మాట్లాడుతూ ప్రపంచంలోని క్రైస్తవులు తమకు అందిన క్రిస్మస్ కానుకలను, బహుమతులను క్రిస్మస్‌కు మరుసటి రోజున తెరచి చూసుకుని తమ ఆనందాన్ని బంధువులు, స్నేహితులు, ఇతరులతో పంచుకుని, పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటారన్నారు. బహుమతుల బాక్సులను తెరచిన కారణంగా ఇది బాక్సింగ్ డేగా రూపాంతరం చెందిందని చెప్పారు. అదే నేటికీ అనేక దేశాలలో ఆనవాయితీగా కొనసాగుతోందన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రేరణాలయ సిస్టర్ వినీల, యూత్ సభ్యులు వినోద్, తంబిరాజ్, రవి కుమార్, అశోక్, వంశీ, రాజు రమేష్‌లతో కలిసి తమకు అందిన బహుమతులను, కానుకలను తెరచి చూశారు.

నేటి నుంచి గణపతి సచ్చిదానంద స్వామీజీ యాత్ర

నూజివీడు: విశ్వ శాంతి కోసం గణపతి సచ్చిదానంద స్వామీజీ ఈ నెల 27 నుంచి ఆంధ్రాలో 55 రోజుల అఖండ యాత్ర నిర్వహిస్తారని దత్తపీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామీజీ తెలిపారు. నూజివీడులో గురువారం స్థానిక దత్తాశ్రమంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గన్నవరం నుంచి ప్రారంభించే రాగ సాగర పేరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని చెప్పారు. ఈ యాత్ర శ్రీకాకుళం వరకు అక్కడి నుంచి రాయలసీమతో సహా తిరుపతి వరకు జరుగుతుందని వివరించారు.

మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికుల ధర్నా

నూజివీడు: మున్సిపల్ కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులను ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి జి.రాజు డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం పారిశుద్ధ్య కార్మికులు ధర్నా నిర్వహించారు. రాజు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేసి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పట్టణాల్లో పరిశుభ్రతకు ఎంతో కష్టపడుతున్న కార్మికులకు పనికి తగ్గ వేతనాన్ని చెల్లించాలన్నారు. అలాగే సమ్మె కాలంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని, కార్మికులకు చెప్పులు, గ్లౌజులు, నూనె, యూనిఫాం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మిక యూనియన్ నాయకులు ఏడుకొండలు, గాంధీ, గంగాధర్, రజని, రాణి, భవాని, పంగిడమ్మ, రాధ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులు

పేదల పక్షపాతి వీఎం రంగా

నూజివీడు: కాపు నేత, మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన రంగా పేదల పక్షపాతి అని పలువురు కాపు నాయకులు పేర్కొన్నారు. వంగవీటి మోహన్ రంగా వర్ధంతి కార్యక్రమం రాధా రంగా మిత్ర మండలి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. పెద్ద గాంధీబొమ్మ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాధా రంగా మిత్ర మండలి నాయకులు పాల్గొన్నారు.

- **ఇబ్రహీంపట్నం:** కొండపల్లి మున్సిపాలిటీలో వంగవీటి మోహన్‌రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ మోహన్‌రంగా బతికి ఉన్నంతకాలం పేద, మధ్య తరగతి ప్రజల అభ్యున్నతికి కృషి చేశాడని చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు మిక్కిలి శరబయ్య, ఎంఏ బేగ్, పోరంకి శ్రీనివాసరావు, కె. శ్రీనివాసరావు, చందా చంటి తదితరులు పాల్గొన్నారు.
- **మైలవరం:** మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ కార్యాలయంలో కూటమి నాయకులు రంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మైలవరంలో కాపునాడు ఆధ్వర్యంలో నాయకులు స్థానికంగా ఉన్న రంగా విగ్రహానికి, చంద్రగూడెంలో కాపునాడు నాయకులు రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



కొండపల్లిలో నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సీపీఐ పతాకాల ఆవిష్కరణ

తిరువూరు: సీపీఐ శత వార్షికోత్సవం సందర్భంగా తిరువూరు సుంకర వీరభద్రరావు భవన్‌లో గురువారం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు తూము కృష్ణయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి సీపీఐ ప్రజల పక్షానే పోరాడుతోందన్నారు. భారతదేశాన్ని ఆంగ్లేయుల నుంచి విముక్తులను చేయడంలో పార్టీ విశేష కృషి చేసిందని చెప్పారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో పార్టీ నాయకులు చిలుకూరి వెంకటేశ్వర్లు, నాగుల్‌మీరా, మాలపాటి ఉదయ్, సుభానీ తదితరులు పతాకావిష్కరణ చేశారు.

- **నూజివీడు:** కార్మికులు, కర్షకుల హక్కుల కోసం అనేక పోరాటాలు చేసిన పార్టీ సీపీఐ అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చలసాని వెంకట రామారావు అన్నారు. సీపీఐ శత వార్షిక దినోత్సవాన్ని పురస్కరించుకొని సీపీఐ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని అమర్ భవన్‌లో సీపీఐ పతాకాన్ని ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. సీపీఐ పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు, అక్కినేని చంద్రరావు, శిఖా ఆకాష్, ఎం.శ్రీనివాస్, సత్తిబాబు, వేణుగోపాలరావు, కామేశ్వరరావు పాల్గొన్నారు.
- **ఇబ్రహీంపట్నం:** ఇబ్రహీంపట్నంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. సీపీఐ రాష్ట్ర నాయకుడు సీహెచ్ కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా సీపీఐ ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసిందని వివరించారు. జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సీహెచ్ దుర్గ, జిల్లా సహాయ కార్యదర్శి బుడ్డి రమేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తిరువూరులో పతాకావిష్కరణ చేస్తున్న కృష్ణయ్య

కార్మికులకు సమ్మె కాలపు హామీలు అమలు చేయాలి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కార్మికుల హక్కుల సాధనలో భాగంగా గతంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సమ్మెలో పాల్గొన్న కొండపల్లి మున్సిపల్ కార్మికులకు అప్పటి ప్రభుత్వం ఇచ్చిన హామీలు కూటమి ప్రభుత్వం అమలు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు గురువారం ధర్నా చేపట్టారు. మండల కార్యదర్శి ఎం. మహేష్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేసి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.2 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వారి కుటుంబంలో ఒకరికి పని కల్పించాలన్నారు. పదవీ విరమణ చేసిన ఐదుగురు కార్మికులకు చిల్లగవ్వ కూడా ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు జీఓ 36 ప్రకారం వేతనాలు పెంచాలన్నారు. కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



కొండపల్లిలో ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు, సీఐటీయూ నాయకులు

బోరు, మోటారు ఏర్పాటు

ముసునూరు: గ్రామ ప్రజల సౌకర్యార్థం 15వ ఆర్థిక సంఘం నిధులతో బోరు వేసి, మోటారు బిగించామని అక్కిరెడ్డిగూడెం పంచాయతీ కార్యదర్శి కంకట విద్యాధరరావు తెలిపారు. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ పులిబళ్ల లక్ష్మీసత్యనారాయణ మోటార్‌ను స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. స్థానికులు బర్మా శ్రీనివాసరావు, మాన్రాజు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ



తిరువూరు: ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకుని తిరువూరు పట్టణంలోని పలు దేవాలయాల్లో గురువారం ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. వేంకటాచలస్వామి ఆలయంలో వైష్ణవ గోష్ఠి సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారికి లక్ష తులసీ దళాలతో విశేష పూజాదికాలు జరిపారు. నల్లాని చక్రవర్తుల విఠలాచార్యులు ధనుర్మాసంలో స్వామివారికి లక్ష తులసీ దళాల పూజా ప్రాశస్త్యాన్ని వివరించారు. కోదండ రామాలయంలో తిరుప్పావ సేవ, సేవాకాలం నిర్వహించారు.

ఉద్దంసింగ్‌కు నివాళి



తిరువూరు: స్వాతంత్ర్య సమరయోధుడు ఉద్దంసింగ్ జయంతి కార్యక్రమం తిరువూరు గీతమ్స్ స్కూల్‌లో గురువారం నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఉద్దంసింగ్ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య పోరాటంలో ఉద్దంసింగ్ వీరోచిత పోరాటాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్‌బీ చారి వివరించారు. జేవీవీ మండల అధ్యక్షుడు సుధాకర్, జిల్లా కార్యదర్శి రాంప్రదీప్, సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలుడిపై వీధి కుక్కల దాడి

మైలవరం: జి. కొండూరు గ్రామంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. పినపాక రోడ్డులో నివాసం ఉంటున్న గుర్రం చరణ్ సాయి వెంకట్ (8)పై వీధి కుక్కలు దాయడంతో గాయపడ్డాడు. రోడ్లపై వీధి కుక్కలు గుంపులుగా తిరుగుతూ రాకపోకలు సాగించేవారిపై దాడులు చేస్తున్నాయి. పంచాయతీ అధికారులు స్పందించి వీధి కుక్కల సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నేడు పోరుబాటను విజయవంతం చేయండి

- **మైలవరం:** విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మైలవరంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు స్థానిక తిరువూరు రోడ్డులోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద పోరుబాట కార్యక్రమం నిర్వహిస్తామని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జోగి రమేష్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్రమంలో జోగి రమేష్ పాల్గొంటారన్నారు. ప్రతి గ్రామం నుంచి పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

తిరువూరు: విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ తిరువూరు నియోజకవర్గ స్థాయిలో శుక్రవారం తిరువూరు మండలం లక్ష్మీపురం విద్యుత్ సబ్‌స్టేషను వద్ద పోరుబాట కార్యక్రమం నిర్వహిస్తామని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ అన్నారు. తిరువూరు శాంతినగర్‌లోని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు నివాసం నుంచి ఉదయం 10 గంటలకు ప్రదర్శన ప్రారంభమవుతుందని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

- **మైలవరం:** వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మైలవరంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు స్థానిక బోసుబొమ్మ సెంటర్ వద్ద కరెంట్ చార్జీలపై కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలకు నిరసనగా పోరుబాట కార్యక్రమం నిర్వహిస్తామని పట్టణ అధ్యక్షుడు పాలా నారాయణరెడ్డి తెలిపారు. అనంతరం విద్యుత్ ఏడీ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేస్తామన్నారు. ప్రతి గ్రామం నుంచి పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు

మైలవరం: గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తోందని తహసీల్దార్ జి. బాలకృష్ణారెడ్డి అన్నారు. మైలవరం మండలం దాసుళ్లపాలెం గ్రామంలో గురువారం రెవెన్యూ గ్రామ సభ జరిగింది. రైతులు వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 53 అర్జీలను అధికారులకు అందజేశారు. సర్పంచ్ నాగమల్లేశ్వరి, ఏఎంసీ మాజీ చైర్మన్ వజ్రాల కుమార్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

- **ఆగిరిపల్లి:** ఈదులగూడెంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 55 అర్జీలను అధికారులు స్వీకరించారు. తహసీల్దార్ పీఎస్వీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం రెవెన్యూ పరమైన సేవలను ప్రజలకు సులువుగా అందించేందుకు సదస్సులు ఏర్పాటు చేశామన్నారు. రీసర్వే డెప్యూటీ తహసీల్దార్ మరియన్న, మండల సర్వేయర్ గంగరాజు, వీఆర్వోలు పాల్గొన్నారు.



అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ ప్రసాద్

నల్లగట్టుపైకి దారి వేసేందుకు టీడీపీ విఫలయత్నం

అడ్డుకున్న తహసీల్దార్ బీవీ సుబ్బారావు

నూజివీడు: పాత రావిచర్ల రెవెన్యూ పరిధిలోని నల్లగట్టును ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇటీవల ఒక విద్యా సంస్థ యాజమాన్యం ఘాట్‌రోడ్డును వేస్తుండగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో తాజాగా పాత రావిచర్లకు చెందిన టీడీపీ కార్యకర్తలు కొందరు గట్టుపై భాగానికి వెళ్లేందుకు వీలుగా మరో వైపు నుంచి ఘాట్‌రోడ్డును ఏర్పాటు చేసేందుకు ప్రొక్లెయిన్‌తో తవ్వుతుండగా గ్రామస్తులు తహసీల్దార్ బీవీ సుబ్బారావుకు సమాచారం అందించారు. ఆయన వీఆర్వోతో కలిసి ఘటన ప్రదేశాన్ని సందర్శించారు. ప్రొక్లెయిన్‌తో అక్రమంగా తవ్వుతుండగా తహసీల్దార్ అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా తవ్వకూడదని, అనవసరంగా కేసుల్లో ఇరుక్కోవద్దని టీడీపీ కార్యకర్తలను హెచ్చరించారు. దీంతో వారు మా వెనుక మంత్రి ఉన్నారంటూ తహసీల్దార్‌తో వాగ్వివాదానికి దిగగా అదేమీ కుదరదని, ప్రొక్లెయిన్‌ను కూడా సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం నుంచి అనుమతులు తెచ్చుకోవాలని సూచించారు. దీంతో టీడీపీ కార్యకర్తలు ప్రొక్లెయిన్‌ను తీసుకెళ్లిపోయారు. విద్యా సంస్థ నిర్వాహకుడు గట్టుపైకి ఘాట్ రోడ్డు వేస్తున్నాడని ఫిర్యాదు చేసిన వారే గట్టుపైకి వేరే వైపు నుంచి ఘాట్ రోడ్డు వేయడానికి ప్రయత్నించడం గమనార్హం.

గట్టుపై భాగాన్ని ఆక్రమించేందుకు యత్నం

నల్లగట్టుపై భాగంలో దాదాపు 20 నుంచి 30 ఎకరాల వరకు సమతలంగా భూమి ఉంది. దీంట్లో దట్టంగా చెట్లు పెరిగి ఉన్నాయి. ఈ భూమిపై ఆక్రమార్కుల కన్ను పడింది. గట్టుపై భాగానికి వెళ్లేందుకు దారి లేకపోవడంతో అక్కడ సాగు చేయాలంటే సాధ్యమయ్యే పని కాదు. ఈ నేపథ్యంలో టీడీపీకి చెందిన పలువురు కార్యకర్తలు అధికారం ముంది కాబట్టి అధికారులెవరూ మనజోలికి రారని, వచ్చినా మంత్రి పేరు చెప్పి బెదిరిస్తే వెనక్కి తిరిగి వెళ్లిపోతారనే ధీమాతోనే గట్టుపైకి దారి వేసే పనులను చేపట్టారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇప్పుడు దారి వేసి పైన ఆక్రమించుకుంటే ఎస్టైన్‌మెంట్ పట్టాలు ఇచ్చినప్పుడు పట్టాలు తెప్పించుకోవచ్చనే ఉద్దేశ్యంతోనే ఆక్రమించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

సారా తయారీదారుల అరెస్ట్

తిరువూరు: తిరువూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గురువారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి సారా తయారీదారులను అరెస్టు చేశారు. విస్సన్నపేట మండలం చంద్రుపట్ల తండాలో సారా తయారుచేస్తున్న మహిళ బాణావతు పింప్లి, ఆమె భర్త బజారిని అరెస్టు చేసి లీటరు సారా, 40 లీటర్ల బెల్లపు ఊట స్వాధీనం చేసుకున్నారు. ఎ.కొండూరు మండలం గొల్లమందల తండాలో సారా తయారీకి సిద్ధం చేసిన 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. గంపలగూడెం మండలం అమ్మిరెడ్డిగూడెంలో గుండ్ల కిశోర్ నుంచి 2 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని నిందితుడ్ని అరెస్టు చేశామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. సారా తయారుచేసే వారిపై పీడీ చట్టం కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



చంద్రుపట్లలో సారా బట్టీ